క్లుప్తంగా

వైభవంగా భస్మార్చన



అగస్త్యేశ్వరస్వామికి భస్మార్చన చేస్తున్న పండితులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం అమావాస్య సందర్భంగా స్వామికి వైభవంగా భస్మార్చన నిర్వహించారు. స్వామివారికి వేద పండితులు ప్రదోష కాల సమయంలో పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్య, రుద్రాభిషేకం నిర్వహించి సహస్రనామార్చన, భస్మార్చన నిర్వహించి భస్మహారతి ఇచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

యేసు మార్గం ఆచరణీయం



బిషప్ దంపతులను సన్మానిస్తున్న నాయకులు

చాపాడు:కరుణామయుడు యేసుక్రీస్తు చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆచరణీయమని రాయలసీమ అధ్యక్ష మండల పీఠాధిపతులు బిషప్ పి.ఐజక్ వరప్రసాద్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని శ్రీరాములపేటలో నూతనంగా నిర్మించిన సీఎస్ఐ చర్చిని శుక్రవారం పి.ఐజక్ వరప్రసాద్, ఆయన సతీమణి సీఎస్ఐ ఆర్‌డీ ఉమెన్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ సీడీ భారతి ప్రారంభించారు. ఈ సందర్భంగా బిషప్ వరప్రసాద్‌ను వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ బాబ్జీ, మాజీ ఎంపీటీసీ జయరాజు కలసి వివిధ ప్రాంతాల చర్చిల అభివృద్ధి సహకరించాలని కోరారు. అనంతరం బిషప్ దంపతులను ఘనంగా సన్మించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ డయాసిస్ రీజనల్ చైర్మన్ రెవ.సి.సాలోమోను, సంఘ గురువు రెవ.బి.రాజేంద్రప్రసాద్, సర్పంచ్ రాజేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగిరెడ్డి, శ్రీరాములపేట సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ప్రయాణికుడికి నగదు అప్పగింత



ప్రయాణికుడికి నగదును అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

మైదుకూరు: బస్సులో మరిచిపోయిన బ్యాగ్‌లో ఉన్న రూ.10వేలు నగదును మైదుకూరు డిపో అధికారులు బాధిత ప్రయాణికుడికి అప్పగించిన సంఘటన శుక్రవారం జరిగింది. పోరుమామిళ్ల మండలం సిద్ధనకిచ్చాయపల్లెకు చెందిన గురయ్య అనే ప్రయాణికుడు శుక్రవారం ఉదయం కడపలో మైదుకూరు డిపోకు చెందిన బస్సు ఎక్కాడు. పోరుమామిళ్లలో దిగిపోయిన సదరు ప్రయాణికుడు బస్సులో తన బ్యాగ్‌ను మరిచిపోయాడు. ఆ విషయాన్ని మైదుకూరు డిపో అధికారులకు తెలియజేశాడు. డిపో ఏపీసీ ఎం.లక్ష్మయ్య డ్యూటీలో ఉన్న బస్సు కండక్టర్ రామయ్యను సంప్రదించి బ్యాగ్‌ను తెప్పించారు. అందులో ఉన్న రూ.10వేలు నగదుతోపాటు సబ్బులు, పిల్లల బట్టలను ప్రయాణికుడు గురయ్యకు డిపో అధికారి విజయరాణి, సెక్యూరిటీ అధికారులు కిశోర్, వెంకటేశ్వర్లు సమక్షంలో అందజేశారు.

ఎమ్మెల్సీ నివాళి



నారాయణరెడ్డి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ

పోరుమామిళ్ల: మండలంలోని యరసాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దశరథరామిరెడ్డి తండ్రి నారాయణరెడ్డి శుక్రవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పార్టీ నాయకులతో కలసి నారాయణరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దశరథరామిరెడ్డి కుటుంబానికి ఎమ్మెల్సీ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో కలసపాడు జెడ్పీటీసీ గురివిరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నరసింహులు, ఉపసర్పంచ్ రవిచంద్రారెడ్డి, నాయకులు రమణారెడ్డి, మాల్యాద్రి, రామలక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

మన ప్రాంతంలో బర్డ్ ఫ్లూ లేదు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ప్రాంతంలో బర్డ్ ఫ్లూ వ్యాధి లేదని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. స్థానిక బీజీఆర్ వీధిలో శుక్రవారం సాయంత్రం బీఎస్ఆర్ చికెన్ సెంటర్ ఆధ్వర్యంలో చికెన్ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 1,000 కిలోల వండిన చికెన్‌ను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ తొలుత ఉభయ గోదావరి జిల్లాల్లో బర్డ్ ఫ్లూపై ప్రచారం జరిగిందన్నారు. జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీకర్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్‌రెడ్డి, బద్వేలి శ్రీనివాసులరెడ్డి, చికెన్ సెంటర్ యజమాని సుబ్బారెడ్డి, మల్లి, పలువురు చికెన్ సెంటర్ల వ్యాపారులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులకు మేలు

- ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం
- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు



చాపాడు: విద్యార్థుల ప్రదర్శనను పరిశీలిస్తున్న డీఎస్పీ, ట్రైనీ డీఎస్పీ



కలసపాడు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో సైన్స్ చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

చాపాడు: వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులకు మేలు జరుగుతుందని, వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికితీయవచ్చని ప్రొద్దుటూరు డీఎస్పీ భావనరెడ్డి, ట్రైనీ డీఎస్పీ భవానీ పేర్కొన్నారు. మండలంలోని పెల్లవోలు వద్ద ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని సైన్స్‌ఫేర్ నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన డీఎస్పీలు భావనరెడ్డి, భవానీ మాట్లాడుతూ సైన్స్ ప్రదర్శన కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఉండే సృజనాత్మకత పెంపొందించబడుతుందని తెలిపారు. ఐడీపీఎస్ డైరెక్టర్ లోహిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బి.రవీంద్ర, సీబీఐటీ అకడమిక్ డీన్ డా.జి.శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో..

ప్రొద్దుటూరు : స్థానిక వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి.జయరామిరెడ్డి, డీన్ ఆచార్య కేవీ రమణయ్య, ఆచార్య జి.జయచంద్రారెడ్డి, ఆచార్య సి.నాగరాజు, డాక్టర్ ఎ.అశోక్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్, అధ్యాపకులు బహుమతులను ప్రదానం చేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

స్థానిక ఎస్‌సీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని విద్యార్థులు, అధ్యాపకులు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ సైన్స్, టెక్నాలజీల్లో విద్యార్థులు నైపుణ్యం సాధించాలని, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్దూ హైస్కూల్‌లో సైన్స్ సంబరాలు

స్థానిక మోడంపల్లెలోని మున్సిపల్ ఉర్దూ హైస్కూల్‌లో శుక్రవారం ఘనంగా సైన్స్ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ లాల్‌జజీ, ఉపాధ్యాయులు షేక్షావలి, అనిల్ అజయ్‌కుమార్, ఓబులేసు, తాజుద్దీన్, సీఎస్ ఆయేషా పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుకోవాలి

మైదుకూరు : విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుకోవాలని మండలంలోని సుంకులుగారిపల్లె స్కూల్ కాంప్లెక్స్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు పేర్కొన్నారు. పాఠశాల హెచ్ఎం నాగలక్ష్మి దేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ –2 నరహరి శర్మ, జీవీ సత్రం హైస్కూల్ హెచ్ఎం జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథంతో చేసే ఆలోచనలు దేశ భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. విజేతలకు, పాల్గొన్న వారందరికీ జ్ఞాపికలు అందజేశారు.

దయాంఖాన్‌పల్లెలో..

మండలంలోని దయాంఖాన్‌పల్లె ప్రాథమిక పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పిల్లలు ఉత్సాహంగా జరుపుకొన్నారు. పాఠశాల హెచ్ఎం ఏవీ సుజాత ఆధ్వర్యంలో పిల్లలు సైన్స్ నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. వారందరికీ పాఠశాల హెచ్ఎం సుజాత, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, విష్ణువర్ధన్ బహుమతులు అందించారు. అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ సుభాన్ సాహెబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైన్స్ అంశాలపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. మైదుకూరులోని జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో హెడ్మాస్టర్ గోశెట్టి రామమోహన్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

బద్వేలు అర్బన్ : మారుతున్న కాలానికనుగుణంగా విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని మండల విద్యాశాఖాధికారి డి.ప్రమీల పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక రత్నం ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించారు. పాఠశాల కరస్పాండెంట్ తలారి రత్నం, డైరెక్టర్ తలారిశ్రీనాథ్, ప్రధానోపాధ్యాయుడు సుబ్బయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పరంధామయ్య కాంప్లెక్స్‌లోని శ్రీ సాయి లిటిల్ కిడ్స్ స్కూల్‌లో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో మాజీ కుడా చైర్మన్ గురుమోహన్ పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమిస్తేనే విజయం

ప్రస్తుతం ఉన్న సాంకేతిక పోటీ ప్రపంచంలో విద్యార్థులు విజయం సాధించడంలో అనేక ఒత్తిళ్లకు గురవుతున్నారని, ఎప్పుడైతే విద్యార్థులు ఒత్తిడిని అధిగమిస్తారో అప్పుడే విజయం సాధ్యమవుతుందని నెల్లూరు ఇస్కాన్ టెంపుల్ సెక్రటరీ డాక్టర్ సుఖదేవ్ మహరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రాచపూడినాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన వ్యక్తిత్వ వికాస శిక్షణా శిబిరంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎన్నో రకాల సవాళ్లను ఎదుర్కొంటూ ఉంటారని, వీటిని అధికమించడానికి ఎంతో ఆత్మస్థైర్యం కావాలని అన్నారు. ఇస్కాన్ టెంపుల్ సభ్యులు బాలభద్రదాస్‌మహరాజ్, రాచపూడినాగభూషణం విద్యాసంస్థల పరిపాలనాధికారి ఆర్.వి.సాయిక్రిష్ణ, ప్రిన్సిపల్ సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాశినాయన : మండలంలోని రెడ్డికొట్టాల ప్రాథమికోన్నత పాఠశాల, పిట్టిగుంట ఎంపీపీ పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ నిర్మల, ఏఎంఓ వీరేంద్రబాబు హాజరయ్యారు. పాఠశాలలో జరుగుతున్న జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను వారు పరిశీలించారు. విద్యార్థులు పలు రకాల సైన్స్ ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రవీంద్రబాబు, రమణారెడ్డి, ఉపాధ్యాయులు దాదాపీర్, మహేష్‌కుమార్, పరిమళజ్యోతి, సురేష్‌కుమార్, విద్యా కమిటీ వైస్ చైర్మన్ బేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

బి.కోడూరు : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బి.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎస్ఆర్‌హెచ్ఆర్‌సీ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ భాస్కర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. ఎస్ఆర్‌హెచ్ఆర్‌సీ సభ్యులు పి.వెంకటసుబ్బారెడ్డి, జి.రామ్మోహన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు మోహన్ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలసపాడు : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు పీ.జె.కవిత ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీవీ రామన్ ప్రపంచ విజ్ఞాన రంగంలో భారత కీర్తిప్రతిష్ఠలను ఎగురవేశారని, భారత వైజ్ఞానిక రంగంలో ఏకైక నోబుల్ బహుమతి విజేతగా అన్నింటికి మించి మనకందరికి సుపరిచితుడుగా తెలిసినటువంటి గొప్ప మేధావి అని కొనియాడారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు, సైన్స్ ఎగ్జిబిట్స్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.కవిత, కె.రాజమ్మ, ఏ.అమరావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక వైఎంఆర్ కాలనీ సాయి కుటీర్ రోడ్డులోని గౌతమ్ హైస్కూల్‌లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన 200 రకాల ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి.

● స్థానిక గీతాంజలి హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు తమ మేధస్సు ఉపయోగించి రూపొందిని సైన్స్ ఎగ్జిబిట్స్ అందరిని ఆకట్టుకున్నాయి. విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఉపయోగపడుగతాయని శివరామిరెడ్డి తెలిపారు.

పోరుమామిళ్ల: విద్యార్థుల భవిష్యత్తుకు సైన్స్ ఆవశ్యకత తప్పనిసరి అని, సైన్స్ ప్రాధాన్యత అన్నిరంగాల్లో ఉందని ఆప్కాస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ డాక్టర్ కల్యాణ చక్రవర్తి, సర్పంచ్ సుధాకర్ పేర్కొన్నారు. సైన్స్ డే సందర్భంగా శుక్రవారం వైష్ణవి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో విజ్ఞాన కళా ప్రదర్శన నిర్వహించారు.



ప్రొద్దుటూరు : వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో బహుమతి అందుకుంటున్న విద్యార్థి

మట్టి తరలింపు విషయంలో గొడవ

మాలేపాడుకు చెందిన ప్రసాద్‌రెడ్డికి కత్తిపోట్లు



చికిత్స పొందుతున్న ప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : మట్టి తరలింపు విషయంలో రెండు వర్గాలకు చెందిన వ్యక్తులు గొడవకు దిగారు. మట్టి తరలిస్తుంటే అడ్డుకున్నాడనే కారణంతో మాలేపాడు గ్రామానికి చెందిన వ్యక్తులు కత్తితో దాడి చేయడంతో అదే గ్రామానికి చెందిన మేకల ప్రసాద్‌రెడ్డి అనే వ్యక్తి గాయపడ్డాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రసాద్‌రెడ్డి రెండు నెలల క్రితం ప్రొద్దుటూరు మండలంలోని రామేశ్వరం దేవుని మాన్యం పక్కన ఉన్న మాలెపాడు పొలం 331 సర్వే నంబర్‌లోని 3.10 ఎకరాల పొలాన్ని రూ. 3.20 లక్షలకు కొనుగోలు చేశాడు. పొలం పక్కన ఉన్న రస్తాలో మాలెపాడు గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి మట్టిని తోలుకుంటున్నాడు. ఈ విషయమై ప్రసాద్‌రెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో శుక్రవారం ప్రసాద్‌రెడ్డి తాను కొనుగోలు చేసిన పొలం వద్దకు వెళ్లాడు. అప్పటికే పొలం పక్కన ఉన్న రస్తాలో మోహన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వీరేంద్రనాథ్‌రెడ్డి, రామనపల్లెకు చెందిన శ్రీనివాసులరెడ్డిలు మట్టిని తోలుతుండగా.. తన పొలంలో మట్టి ఎలా తరలిస్తారని ప్రసాద్‌రెడ్డి వారిని ప్రశ్నించాడు. దీంతో మా పైనే నువ్వు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తావా అంటూ కత్తితో ప్రసాద్‌రెడ్డిని పొడిచారు. ఇకపై తమకు తెలియకుండా ఈ పొలంలోకి వస్తే చంపుతామంటూ బెదిరించారు. ప్రసాద్‌రెడ్డిని అతని స్నేహితుడు బైక్‌లో ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. రూరల్ ఎస్ఐ మహమ్మద్‌రఫీ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీస్ వలయంలో మాలెపాడు

ఎర్రగుంట్ల : ప్రసాద్‌రెడ్డిపై దాడి నేపథ్యంలో ఫ్యాక్షన్ గ్రామమైన మాలెపాడు గ్రామస్థులకు టెన్షన్ మొదలైంది. ముందస్తు జాగ్రత్తగా కొండాపురం సీఐ మహమ్మద్‌రఫీ, ఇద్దరు ఎస్ఐలు, పలువురు పోలీసులు గ్రామంలో బందోబస్తు ఏర్పాటుచేశారు. యర్రగుంట్ల మండలంలోని మాలెపాడు గ్రామం మొత్తంగా పోలీసుల వలయంలో ఉండిపోయింది. ప్రొద్దుటూరు రూరల్ పరిధిలోనే జగనన్న కాలనీలో మాలెపాడు గ్రామానికి చెందిన మేకల ప్రసాద్ రెడ్డిపై ఐదుగురు కత్తులతో శుక్రవారం దాడి చేశారు. మట్టి తవ్వకం వ్యవహారంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణే కారణమని స్థానికులు భావిస్తున్నారు. దీంతో గ్రామంలో మళ్లీ ఫ్యాక్షన్ రాజుకుంటుందేమోనని శుక్రవారం ఆందోళనకు గురయ్యారు. ఇది గమనించిన పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. గట్టి బందోబస్తు నిర్వహించారు.

విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలని జిల్లా విద్యాధికారి షంషుద్దీన్ తెలిపారు. స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రగతి పరుగులు తీయడంతో సైన్స్ ప్రాముఖ్యత పెరిగిందన్నారు. ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ సామర్థ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని, భావ వ్యక్తీకరణ పెంపొందించుకోవాలని తెలిపారు. సంస్కృతి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి సైన్స్ మానవ వికాసానికి దోహదపడాలే నీ వినాశనానికి దారి తీయకూడదన్నారు. అనంతరం నిర్వహించిన పలు పోటీల్లో విజేతలను ప్రకటించారు. సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ఇంగ్లీషు మీడియంలో దినేశ్వర్‌రెడ్డి(జెడ్పీహెచ్ఎస్, కల్లూరు), అష్రఫ్ (మున్సిపల్ ఉర్దూ హైస్కూల్, మోడంపల్లి), విష్ణువర్ధన్ (జెడ్పీహెచ్ఎస్ బాయ్స్, వేంపల్లె), తెలుగు మీడియంలో ఎస్.లిఖిత(జెడ్పీహెచ్ఎస్, చిన్న కొమ్మెర్ల), రూప(ఎస్ఆర్ఎంహెచ్, ప్రొద్దుటూరు), హరిణ మాధురి (ఎస్ఎఆర్ఎంహెచ్, ప్రొద్దుటూరు) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విశ్రాంత ఎంఈవో పరమేశ్వరయ్య, రమణమహర్షి హైస్కూల్ పూర్వ విద్యార్థులు అందించిన బహుమతులను క్లాస్–1 కాంట్రాక్టర్ కృష్ణార్జునరెడ్డి విద్యార్థులకు అందజేశారు. సైన్స్ క్లబ్ జిల్లా కన్వీనర్ విజయమోహన్‌రెడ్డి, ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణి, వంశీకృష్ణ, అల్లాబకాష్, సుబ్బానాయుడు, గోపీనాథ్ రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో జైలు శిక్ష

వేంపల్లె : అత్యాచారం కేసులో ఓ ముద్దాయికి కోర్టు మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ తిరుపాల్‌నాయక్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. మండలంలోని అలిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన కొమ్మద్ది గంగయ్య రోజు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన కూలి పనులకు వెళ్లిన సమయంలో మతిస్థిమితం లేని అతడి భార్యపై అదే గ్రామానికి చెందిన శివ నారాయణ అత్యాచారం చేశాడు. బాధితురాలి భర్త గంగయ్య ఫిర్యాదు మేరకు 2023 జూన్‌లో కేసు నమోదు చేశారు. శుక్రవారం కడప మహిళ కోర్టులో సాక్షులు చెప్పిన మాటలు నిరూపణ కావడంతో ముద్దాయి శివ నారాయణకు జడ్జి రమేష్‌కుమార్ జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

జింక్ లోపాన్ని అధిగమించండి

మైదుకూరు : వేరుశనగ పంటలో జింక్ లోపాన్ని రైతులు అధిగమించాలని మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ తెలిపారు. సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శనలో భాగంగా కేవీకే శాస్త్రవేత్తలు శుక్రవారం దువ్వూరు మండలం మదిరేపల్లె గ్రామంలో సాగు చేసిన నూనె గింజల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పది నుంచి నెల రోజుల్లో కోతకు వచ్చే వేరుశనగ పంటలో జింక్ ధాతు లోపాన్ని కేవీకే శాస్త్రవేత్తలు కనుగొన్నారు.

క్రమశిక్షణతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

బద్వేలు అర్బన్ : క్రమశిక్షణతో విద్యార్థులు ఉన్నత స్థానం చేరుకోవచ్చని, నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యా బోధన ఉజ్వల భవిష్యత్‌ను ఇస్తుందని మండల విద్యాశాఖాధికారులు ఎస్.చెన్నయ్య, డి.ప్రమీల పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చిన్నకేశంపల్లె ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో వారు మాట్లాడుతూ ఒక సైనికుడికి ఆయుధం ఎంత అవసరమో విద్యార్థులకు అభ్యసన అనేది అంత ముఖ్యమని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం ధర్నా



కొత్తపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ప్రొద్దుటూరు రూరల్ : సుందరయ్యనగర్‌లో సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయాలని కొత్తపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ సుందరయ్య కాలనీ ఏర్పడి 14 ఏళ్లు కావస్తున్నా అక్కడ ఇప్పటికీ సిమెంటు రోడ్లు, ఇతర రకాల మౌలిక సదుపాయాలు కల్పించేలేదని తెలిపారు. ఎన్నోమార్లు అధికారులకు, రాజకీయ నాయకులకు, పేద ప్రజల తరపున సమస్యలను విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ధర్నా చేస్తున్న సమయంలో సర్పంచ్ శివచంద్రారెడ్డి అనుచరులు పేదలను బెదిరించడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రజలు లేని ప్రాంతాల్లో కూడా సర్పంచ్ సిమెంటు రోడ్లు వేస్తున్నారని తెలిపారు. ప్రజలు ఉన్న సుందరయ్యనగర్‌లో సిమెంటు రోడ్లు వేయకపోతే కొత్తపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిరంతరాయంగా ధర్నా కొనసాగిస్తామన్నారు. సీపీఎం సుందరయ్య కాలనీ కార్యదర్శి శేఖర్, డీవైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్, మహిళా సంఘం నాయకురాలు రాములమ్మ, శ్రీధర్, చెన్నమ్మ, లాల్‌బీ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అందని మహాప్రసాదం

- కొరవడిన పర్యవేక్షణ
- ఇబ్బందిపడ్డ భక్తులు



బి.మఠంలో మహాప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న పిటీపర్సన్

బ్రహ్మంగారిమఠం: శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబ కల్యాణ మహోత్సవాలు ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభయ్యాయి. మహాశివరాత్రి 26న స్వామి కల్యాణం నిర్వహించారు. అయితే ప్రతి ఏడాది ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా వచ్చి స్వామిని దర్శించుకునేవారు. ఈ ఏడు భక్తుల సందడి కన్పించలేదు. ఇందుకు ప్రధాన కారణం స్వామి కల్యాణోత్సవంపై నిర్వాకులు ప్రత్యేక శ్రద్ధ వహించలేదనే విమర్శలు వస్తున్నాయి. ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లు ఆలయ అధికారులు ప్రతి ఏడాది ఆవిష్కరించి ప్రచారం చేసేవారు. అయితే ఈ సారి ఆనవాయితీకి మంగళం పాడారు. పోస్టర్లు ప్రింట్ చేయలేదని, ప్రచారం కూడా చేయలేదని భక్తులు విమర్శిస్తున్నారు. అయితే ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బి.మఠం దేవస్థానంలో మహాప్రసాదాన్ని పంపిణీ చేశారు. స్థానికంగా ఉన్న భక్తులకు ప్రసాదం పంపిణీ చేయకపోవడంతో వెనుతిరిగి వెళ్లిపోయారు. మఠం పూజారులు, సిబ్బంది అందినకాడికి ప్రసాదం తీసుకెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు.

అల్లాడుపల్లె వీరభద్రస్వామికి రూ.11 లక్షల ఆదాయం

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థానానికి మహా శివరాత్రి పురస్కరించుకుని రెండు రోజులకు రూ.11,58,417 ఆదాయం వచ్చినట్లు ఈఓ శ్రీనివాసులు, కమిటీ సభ్యులు వీరనారాయణ యాదవ్ తెలిపారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల కారణంగా స్పెషల్ దర్శనం రూ.10 ద్వారా రూ.62,440, ప్రత్యేక దర్శనం రూ.100 టికెట్ ద్వారా రూ.95 వేలు, తలనీలాల ద్వారా రూ.20,800, ఖాళీ స్థలాలలో అంగళ్ల ద్వారా రూ.49,120, సేవా టికెట్స్ వల్ల రూ.2,27,360, లడ్డూ ప్రసాదం అమ్మగా రూ.94,400, పులిహోర ద్వారా రూ.15,600, అన్నదాన సత్రం ద్వారా రూ.1,41,008, తాత్కాలిక హుండీల ద్వారా రూ.3,34,769, లడ్డూ, పులిహోర ప్రసాదం ద్వారా రూ.1,14,560, అభిషేకం ద్వారా రూ.3400 ఆదాయం వచ్చినట్లు వారు పేర్కొన్నారు.

బైక్ మెకానిక్ ముసుగులో చోరీలు

కడప అర్బన్ : మోటార్ సైకిల్ మెకానిక్ ముసుగులో వచ్చి బైక్‌లు దోచుకెళ్తున్న దొంగకు పోలీసులు చెక్ పెట్టారు. నిందితుడిని అరెస్టు చేసి రూ.8 లక్షల విలువైన 18 మోటారు సైకిళ్లను రికవరీ చేశారు. కడప వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రామకృష్ణ వివరాలు వెల్లడించారు. ఇటీవల మోటారు సైకిళ్ల చోరీలు పెరగడంతో ఎస్పీ, డీఎస్పీ ఆదేశాల మేరకు.. సీఐ, ఎస్ఐలు నిఘా పెట్టారు. అనుమానితులను విచారించి.. కడప రవీంద్ర నగర్‌కు చెందిన వేల్పుల నరేంద్ర అలియాస్ మహేంద్రను నిందితుడిగా గుర్తించారు. శుక్రవారం మహేంద్రను అరెస్టు చేసి అతడి నుంచి 18 మోటార్‌సైకిళ్లను రికవరీ చేశారు.

బైక్‌పై వచ్చి గొలుసు చోరీ

ఖాజీపేట : రోడ్డు దాటుతుండగా బైక్‌పై వచ్చి మహిళ మెడలో నుంచి దుండగుడు గొలుసు లాక్కెళ్లిన ఘటన శుక్రవారం పేరారెడ్డి కొట్టాలులో చోటు చేసుకుంది.సీఐ మోహన్ కథనం మేరకు పేరారెడ్డి కొట్టాలుకు చెందిన ఆవుల లలితమ్మ(54) కూలి పనికి వెళ్లి తిరిగి ఆటోలో బయలుదేరి బుడ్డాయపల్లె వద్ద దిగారు. అక్కడ నుంచి పేరారెడ్డి కొట్టాలుకు వెళుతుండగా అక్కడ బైక్ పై ఉన్న ఇద్దరు వ్యక్తులు కర్నూలుకు పోయే దారి ఎటు అని అడుగుతూనే ఆమె మెడలో ఉన్న 3 తులాల బంగారు గొలుసును లాక్కొని వెళ్లారు. ఆమె ఖాజీపేట స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బైక్‌లోని వ్యక్తులు హెల్మెట్ ధరించడం వల్ల వారిని గుర్తు పట్టలేక పోయానని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం



పట్టుబడిన బియ్యంతో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మహేంద్రనాథ్ రెడ్డి

ప్రొద్దుటూరు రూరల్ : స్థానిక సుబ్బిరెడ్డికొట్టాల వీధిలోని రేషన్ షాప్ నుంచి ఎండీయూ వాహనంలో చౌక బియ్యాన్ని తరలిస్తుండగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మహేంద్రనాథ్ రెడ్డి దాడి చేసి 25 బస్తాల చౌకబియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎండీయూ ఆపరేటర్ సుబ్రహ్మణ్యం రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నాడని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. పట్టుబడిన బియ్యం సుమారు 12.5 క్వింటాళ్లు ఉంటాయని, వీటిని ఈశ్వర్‌రెడ్డినగర్‌లోని చౌకదుకాణంలో భద్రపరిచామని ఆయన తెలిపారు.

పాలిసెట్‌కు ఉచిత కోచింగ్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొర్రపాడు రోడ్డులో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు పాలిసెట్ కోచింగ్‌ను ఉచితంగా ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జె.అశోక్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

హామీలు నెరవేర్చని కూటమి

చాపాడు : కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎన్నికల హామీలను గాలికి వదిలేసి ప్రజల్ని నట్టేట ముంచిందని వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమలుకు నిధులు కేటాయించలేదన్నారు. సంపద సృష్టి అంటే అప్పులు చేయడమేనా అని ప్రశ్నిస్తూ.. వైఎస్ జగన్ సర్కార్ అప్పులతో రాష్ట్రాన్ని ముంచిందని చెప్పి అంతకు మించి 3 రెట్లు అప్పు చేసిన కూటమి సర్కార్‌కు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు.